# రెక్కగూడు

నేనూ గంగరాజు ఇంటర్‌వరకు మా ఊళ్ళోనే చదువుకున్నాం. మా నాన్న చనిపోవడంతో నా చదువు అక్కడితో ఆగిపోయింది. గంగరాజు వాళ్ళు కూడా మాకులాగా ఉన్నవాళ్ళేమీ కాదు. వాడికి బి.యస్.సి. చదవాలనే కోరిక బావుండేది. పయి చదువులకు ఇబ్బంది అయ్యేసరికి వాడి మేనమామ దగ్గరకు బెంగుళూరు వెళ్ళాడు. నేను టైపింగ్ నేర్చుకుని తాలూకాఫీసు ఆవరణలో కూర్చునే లాయరు దగ్గర టైపింగ్ పని చేసేవాడిని. మా లాయరు ఎక్కువేం ఇచ్చేవాడు కాదు. వేరే ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేసేవాడిని కాని అదృష్టం నాకు దూరంగానే ఉండేది.

మూడు సంవత్సరాల తర్వాత గంగరాజు బెంగుళూరు నుండి తిరిగి వచ్చాడు. మనిషి బాగా నలిగిపోయాడు. అందరితో తను కాలేజీలో డిగ్రీ చదువు కుంటున్నానని చెప్పి నాతో మాత్రం నిజం చెప్పాడు, "మా మేనమామ నాకు చదువేం చెప్పించలేదు. బేల్దారి పని మటుకు చూపించాడు."

నాకు బాధవేసింది. "తిరిగి బెంగుళూరు వెళ్ళి పోతావా?" అడిగాను.

"వెళ్ళను".

"ఏం చేద్దామనుకుంటున్నావు?"

"అక్కడ నేర్చుకున్న పనేదో ఇక్కడ చేసుకొంటే ఎలా ఉంటుంది?"

"బావుంటుందా?"

"మన కాళ్ళమీద మనం బతకడం తప్పా?" అన్నాడు.

ఆ రాత్రి వాడి మాటల గురించి చాలాసేపు ఆలోచించాను. మంచిగానే అనిపించాయి.

తాపీ పనుల్లో నాకు తర్ఫీదు ఇచ్చి నాలుగయిదు చిన్నాచితక పనులు స్వతంత్రంగా నాచేత చేయించాడు. బాగా చేసేసరికి నామీద నాకు విశ్వాసం

ఏర్పడింది. ఇంటరు వరకు చదువుకుని వీళ్ళు తాపీ మేస్త్రీలుగా తయారయ్యా రేమిటని చాలామంది అనుకున్నా గంగరాజు నా చెయ్యి వదలలేదు.

మా ఊళ్ళోనే గంగరాజు తనే ప్లాను వేసి నాలుగయిదు ఇళ్ళు చాలా బాగా కట్టిన తర్వాత పేరు రావడం మొదలయింది. మాకు అవసరం ఉన్నా డబ్బు పట్ల అత్యాశ పడలేదు. ఇళ్ళు కట్టించుకున్న వాళ్ళ దగ్గర డబ్బు వసూలుకు నన్ను పంపించేవాడు. ఒకటికి నాలుగయిదు సార్లు తిప్పించుకొనే వాళ్ళు. ఓపికగా తిరిగి ఎంతిస్తే అంత తీసుకొచ్చేవాడిని. అవి అందితే కాని మా కడుపులు నిండేవి కావు.

గంగరాజుకు పేరు వస్తూ కొత్తకొత్త పనులు ఒకదాని తర్వాత ఒకటి వస్తోంటే ధర నెమ్మదిగా పెంచడం మొదలెట్టాడు. మిగిలిన వాళ్ళతో పోలిస్తే సరసంగా ఉండేవి. అతని బెంగుళూరు అనుభవం మాకు బాగా అచ్చొచ్చింది. రైల్వే లైన్ల కల్వర్టు పనులు, చిన్న బ్రిడ్జిల సబ్‌కాంట్రాక్టు పనులు మాకు వచ్చాక మేం వెనక్కి తిరిగి చూడలేదు. తీరిక దొరకడం కష్టమయిపోయింది. రోజులు, వారాలు, నెలలు సంవత్సరాలు ఎలా గడిచిపోయాయో మాకుగుర్తులేదు. నా ఆర్థిక పరిస్థితి ఒక మోస్తరుగా మెరుగయినా, గంగరాజు పరిస్థితి బాగా మెరుగయింది. పెట్టుబడి అతనిది. తంటాలుపడి ఎలాగో ఒకలాగ డబ్బు సమకూర్చేవాడు. మాట నిలబెట్టుకునేవాడు.

డొనేషన్ కట్టి తన కొడుకును సివిల్ ఇంజనీరింగ్‌లో చేర్పించాడు. ఆ రోజుల్లో సివిల్‌కు మంచి డిమాండ్ ఉండేది. మా వాడిచదువు ఏడో తరగతితోనే ఆగిపోయింది. ఎక్కువ స్వాతంత్ర్యం ఇచ్చి వాడిని నేనే పాడుచేశానను కుంటాను. వాడిపేరు అచ్యుతం, వాడు ఇంట్లో ఉంటే గంటల తరబడి నిద్రపోతుంటాడు. బయటకు వెళ్తే తిరిగి ఇంటికి చేరుకునే సరికి రాత్రి రెండవుతుంది. మా దగ్గర పని చేయడం వాడికి ఇష్టం లేదు. చెప్పి చెప్పి విసుగు పుట్టి నాకే ఎదురు తిరుగుతోంటే చెప్పడం మానేశాను. నా భయం ఏమిటంటే వాడు అలా రికామిగా తిరిగి జులాయిగా మారిపోతాడేమో నని; అచ్యుతం గురించి గంగరాజు కూడా బాధ పడేవాడు. ఒకటీ రెండుసార్లు అచ్యుతాన్ని పిలిచి మందలించినా లాభం లేకపోయింది.చేయి ఎత్తేశాడు.

మా పనులు మా జిల్లా దాటి పక్క జిల్లాలకు పాకి కొత్త పనులు రావడం మొదలెట్టాయి. మా వేషభాషల్లో మార్పులు వచ్చాయి. పెద్దవాళ్ళతో పరిచయాలు ఏర్పడి గట్టి పడసాగాయి గంగరాజు ఒక కారు కొనుక్కున్నాడు. నాకో జీప్ కొనిచ్చాడు. గంగరాజు కొడుకు సుబ్బరాజు చదువు పూర్తిచేసి, మా కంపెనీలో ఒక

డైరక్టరయ్యాడు. చూడడానికి కుర్రాడు అమాయకుడిలా కనిపించినా గట్టివాడే. ఎవరితో ఎలా పనులు చేయించుకోవాలో బాగా తెలుసు. కొన్ని నెలలలోనే మంచిపేరు సంపాదించుకున్నాడు. మా సంస్థ రెక్కలు పరుచుకుని ఎగురుతోంటే గంగరాజు తన పనులు ఒక్కొక్కటిగా సుబ్బరాజు చేతుల్లో పెట్టడం మొదలెట్టాడు.

మా అచ్యుతం పరిస్థితే నాకేం అర్థం కాకుండా ఉండేది. వాడంటే నా భార్యకు పిచ్చిప్రేమ. మాట పడనిచ్చేదికాదు. ఊళ్ళో ఎక్కడ ఏ గొడవ జరిగినా మా వాడి చేయి ఉండేది. పోలీసుల షీట్లలో నమోదయ్యాడు.

ఆ మధ్యలో నూట యాభయి ఇళ్ళు కట్టించిపెట్టే కాంట్రాక్ట్ దొరికింది. రాత్రీ, పగలు కష్టపడి అనుకున్న సమయానికి ముందుగానే కట్టించి పెట్టాం. దాంతో మా పేరు మరింత పెరిగింది. మరికొన్ని ఆర్డర్లు వచ్చాయి. వాటిని తట్టుకోడానికి కట్టే పద్ధతిలో మార్పు తెచ్చి కొత్త యంత్రాలు, వస్తువులు కొన్నాం. పెద్ద సంస్థల నుండి కొన్ని అద్దెకు తీసుకున్నాం. అన్ని పనులకు మానసిక వత్తిడికి గురికాసాగాను. తప్పుకోవడం మంచిదేమో అనిపించింది.

ఒక సాయంత్రం సుబ్బరాజు దగ్గర కూర్చుని, “నా వయసు అరవయి అయిదు దాటింది. మునుపటంత సమర్ధవంతంగా పనిచేయలేకపోతున్నట్టు అనిపిస్తోంది. పదవీ విరమణ చేసి విశ్రాంతి తీసుకుందామని అనుకుంటున్నాను” అన్నాను.

సుబ్బరాజు ఆశ్చర్యపోతూ కొద్దిసేపు నా ముఖంలోకి చూసి నేను అన్నది తనకు నచ్చలేదన్నట్లుగా తల అడ్డంగా ఆడించాడు. స్థిరపడని నేను అలా అడుగుతానని అనుకుని ఉండడు. చూస్తున్న ఫయిలు మూసి గడ్డం కింద చేతులు పెట్టుకుని, ఏదో అందామనుకున్నట్టు ఉన్నాడు. అనలేదు.

నేనే అన్నాను, “రెండు మూడు నెలల నుండి నీతో ఈ మాట చెబుదామనుకుంటే చివరకు ఇవేళ అవకాశం దొరికింది”.

“మన ఆఫీసులో మిమ్మల్ని ఎవరేమయినా ఏమయినా అన్నారా?” అడిగాడు.

“లేదు, ఎవరేమీ అనలేదు”.

“మా వలన తెలియకుండా కష్టం ఏమయినా జరిగిందా?”

“లేదు. ఎప్పుడూ జరగలేదు.”

“ఈ సంగతి మా నాన్నగారితో చెప్పారా?”

“చెప్పలేదు. చెబితే ఒప్పుకోడు.”

"మీరు వెళ్ళడం నాకేమాత్రం ఇష్టంలేదు. ఇందుకు నాన్నగారు ఒప్పుకుంటారని నేనూ అనుకోవడం లేదు. మేమంతా మిమ్మల్ని చూసి ఎంత గర్వపడుతుంటామో తెలుసా?" ఆగాడు. నా చేతులమీద తన చేయిపెట్టి, "ఇది నా రిక్వెస్ట్. ఇంకోసారి ఆలోచించండి" అన్నాడు.

"నేను బాగా అలిసిపోయాను. విశ్రాంతి అవసరం అనిపిస్తోంది. దానికి మించి నా భార్య ఆరోగ్యం ఏమీ బావుండడం లేదు. కనిపెట్టుకొని ఉండాలి..... మీనాన్నను నేను ఒప్పిస్తాను... " అంటున్నాను. నామాటలు వింటున్నట్టు అనిపించడం లేదు. ఆలోచనల్లో పడినట్టు అన్నాడు. కుర్చీలోంచి లేచి పంట్లాం జేబుల్లో చేతులు పెట్టుకుని కిటికీ దగ్గరకు వెళ్లి కొద్దిసేపు బయటకుచూసి తిరిగి వచ్చి తన సీట్లో కూర్చోగానే, "మీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు అందుబాటులో ఉంటాను" అన్నాను.

నిట్టూర్చి,"మీరు మాతో ఉండడానికి, అందుబాటులో ఉండటానికి మధ్య చాలా దూరం ఉంది అంకుల్. మీరు మా నాన్నగారితో మాట్లాడండి..." అంటోంటే అతని మాటలకు అడ్డు తగిలి, "మీ నాన్న ఒప్పుకోడనే నీతో చెబుతున్నాను". అన్నాను.

"మా నాన్నగారితో నేను మాట్లాడతాను" అని బల్ల సొరుగు బయటకు లాగి ఆకుపచ్చరంగు ఫయిలు తీసి నా ముందుంచి, "అంకుల్, మీకీ కొత్త పని అప్పజెప్పుతున్నందుకు దయచేసి మీరు ఏమీ అనుకోకండి. ఇది అర్జంటు. ఎంత త్వరగా కట్టించగలిగితే అంత మంచిది. దీని బాధ్యతంతా మీది. ఈ ఫయిల్లో ప్లాను, ఎస్టిమేట్స్, తదితర వివరాలు ఉన్నాయి. డబ్బు ఎంత అవసరమయినా వెనకాడకండి. కేషియరుకు చెబుతాను. అడిగి తీసుకోండి. ఒక్క విషయం. ఇల్లు మటుకు క్లాస్‌గా ఉండాలి" అన్నాడు.

"చివరి పని అనుకోవచ్చా?" నవ్వుతూ అడిగాను.

"రెండు వందలపాళ్ళు" అని కుడిచేయి నా చేతులమీద వేసి నిమిరాడు.

మూడోరోజున పని మొదలుపెట్టాను. అయిదు నెలల లోపల పని పూర్తి చేద్దామనుకున్నాను. కాని ఆరునెలలు దాటాక కాని ఆ ఇల్లు పూర్తికాలేదు. గెస్ట్‌హవుస్ కోసమని ప్లాన్ చేసుకుంటారనుకుంటాను, చూడటానికి క్లాస్‌గా ఉన్నా ఇల్లు కట్టడానికి అవసరమయినవి మంచివి వాడలేదు. నాసిరకంవి వాడి పూర్తి మనసు పెట్టక ఎలాగో ఒకలాగ అయిందనిపించాను. అనుకున్న దానికి మూడువంతుల ఖర్చు కూడా కాలేదు. అయిదు లక్షలచిల్లర వరకు మిగిలాయి. ఆ

డబ్బు నేను ఎందుకు తీసుకోకూడదనినిపించింది. నేను నొక్కేసినా ఎవరూ తెలుసుకోలేరు. నేను రాసిచ్చిందేలెక్క. అంతకుముందు అటువంటి పనులు ఎప్పుడూ చేయలేదు. నన్ను నిలబెట్టి పోషించిన వాళ్ళకు ద్రోహం చేయడానికి నామనసు అంగీకరించలేదు. మిగిలిన డబ్బును ఆఫీసులో జమ చేశాక కాని నా గుండె మించి పెద్ద బరువు తొలిగినట్టు అనిపించలేదు. ఇంటికి కావలసిన ఫర్నిచరు సుబ్బరాజు ప్రత్యేకంగా హైదరాబాద్ నుండి తెప్పించాడు.

ఇంటి ప్రారంభోత్సవానికి గంగరాజు సతీసమేతంగా కారు వేసుకువచ్చి నన్నూ నా భార్యను తీసుకెళ్ళాడు. ఇంటిని రంగు రంగుల దీపాలతో అలంకరించారు. ప్రారంభోత్సవం నా భార్య చేత చేయించారు. రిబ్బను కత్తిరించిన వెండికత్తెర నా చేతిలో పెట్టి, దాంతోపాటు ఇంటితాళం చెవి, డాక్యుమెంట్లు నాకు అందించి, "ఈ ఇల్లు నీదిరా. నీది. నువ్వు నిస్వార్థంగా మాకు ఎంతో సహాయం చేశావు. నీకని నువ్వేమీ ఉంచుకోలేకపోయావు..." అంటోంటే అతని కంఠస్వరానికి కన్నీళ్లు అడ్డం వచ్చాయి. నన్ను కౌగలించుకున్నాడు.

నా భార్యను కొట్టి నాకూతురూ, అల్లుడు మా ఇంట్లోని నగలూ, డబ్బు దొంగిలించి తీసుకు వెళ్ళిన మూడునెలల తర్వాత నా కూతురుమీద కిరసనాయిలు పోసి అల్లుడు చంపినప్పుడు నాకు ఏడుపురాలేదు. నడిరోడ్డుమీద అచ్యుతాన్ని వాడి స్నేహితులే పట్టపగలు నరికి చంపినప్పుడూ నాకు ఏడుపు రాలేదు. నాకు ఊహ తెలిసిన దగ్గరనుండి నేను ఎవరి ముందూ ఏడవలేదు. మొండివాడిని. ఏడుపురాదు. అయితే, ఇన్ని సంవత్సరాలు గంగరాజుతో నమ్మకంగా ఉండి చివర్లో కొద్ది డబ్బులకోసం మోసం చేద్దామన్న ఆలోచనకు ఏడుపు ఆపుకోలేకపోయాను. నేను చనిపోయే వరకు ఆ బాధ నాకూడా ఉంటుందేమో!

❖ **తేజ వారపత్రిక, 14 నవంబర్ 2008**